క్లుప్తంగా

ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి చేయాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి మెరుగైన ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. స్థానిక 27వ డివిజన్ బావాజీపేటలో సోమవారం క్షేత్ర స్థాయిలో అమలు జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలు, ప్రస్తుతం జరుగుతున్న ఎన్సీడీ, సీడీ సర్వే, ఎల్సీడీసీ సర్వేలను ఆమె పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యకార్యక్రమాల అమలు తీరు, సర్వేలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులు, నివేదికలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దుర్గాపురం ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సృజన, డీపీఓ మహేష్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ పంచమి వేడుకలు

చిన్నారులకు పుస్తకాలు పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్ లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో సోమవారం శ్రీ(వసంత) పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరస్వతీ దేవి జన్మించిన రోజు కావడంతో వేకువ జామునుంచే భక్తులు ఆలయానికి క్యూ కట్టారు. నాగమానసాదేవి అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులు పుస్తకాలు, పెన్నులు అమ్మవారి ముందు ఉంచి ఆరాధించారు. పూజల అనంతరం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతీదేవి అనుగ్రహం చిన్నారులకు కలగాలని ఆశీర్వదించారు. అమ్మవారిని ఆరాధిస్తే మంచి చదువు, చక్కటి వాక్కు లభిస్తుందన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు.

ఆక్రమణలు తొలగించారు



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు జీవీఆర్ నగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లో సోమవారం టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. ఇక్కడ రోడ్డు పక్కన యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నాయి. ఈ విషయాలను వివరిస్తూ 'సాక్షి' దినపత్రికలో ఈ నెల ఒకటో తేదీన 'అంతా మా ఇష్టం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు అనధికారికంగా ఏర్పాటుచేసిన బడ్డీలను, దుకాణాలను తొలగించారు.

త్రిశక్తి పీఠంలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో పంచమి సందర్భంగా సోమవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 1000 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించగా అందులో 500 మందికి ఉచితంగా నిర్వహించారు. చిన్నారులకు పలక, బలపం, వ్యాకరణ పుస్తకం, పెన్సిల్, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం పాలు, పాయసం, పాలకోవ, చక్కెర పొంగలి ప్రసాద వితరణ చేశారు. శ్రీపంచమి సందర్భంగా కాళీమాత అమ్మవారు చిన్నారులకు, భక్తులకు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సరస్వతీ పుష్కర జ్ఞానం–2025 పుస్తకాన్ని ఆవిష్కరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు భారతుల విజయకిరణ్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

శిథిలావస్థలో వాహనాలు

- రహదారులపై ఏళ్ల తరబడి పడి ఉంటున్న కార్లు, ఆటోలు, బైక్‌లు
- ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్నా పట్టించుకోని వైనం
- నిత్యం ట్రాఫిక్‌తో వాహనదారుల ఇబ్బందులు
- ఏమీ పట్టనట్లు ఉంటున్న ట్రాఫిక్, టౌన్ ప్లానింగ్ అధికారులు



గోశాల వద్ద నెలల తరబడి నిలిపిన వాహనాలు



జీఎస్ రాజు రోడ్డులో శిథిలావస్థలో ఉన్న కార్లు, ద్విచక్ర వాహనాలు

సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం జీఎస్ రాజు రోడ్డులో ఆక్రమణలతో రోడ్డు కుంచించుకుపోతోంది. ఒక పక్క కొంతమంది అనధికారికంగా రోడ్లను ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకుంటుంటే, మరో పక్క రోడ్డు మీదే ఏళ్ల తరబడి కొంతమంది యజమానులు మరమ్మతులకు గురైన తమ వాహనాలను అలాగే వదలివేయడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ముఖ్యంగా విజయవాడ నుంచి నూజివీడు వైపు వెళ్లే ఈ మార్గంలో బస్సులతో పాటు ప్రైవేటు వాహనాల రద్దీ కూడా ఎక్కువగానే ఉంటుంది.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కనే...

ప్రతి రోజూ వాహనాల రద్దీతో ఉండే జీఎస్ రాజు రోడ్డులో అనేక చోట్ల శిథిలమైన కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను సంవత్సరాల తరబడి రోడ్డు మీదే వదలివేయడంతో తరచూ ట్రాఫిక్



ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కనే శిథిలావస్థలో ఉన్న వాహనాలు

సమస్య ఏర్పడుతోంది. ప్రతి రోజూ వాటిని దాటుకుంటూ వెళ్తున్న ట్రాఫిక్ పోలీసులు సైతం వాటిపై దృష్టి పెట్టకపోవడంపై స్థానికులు విమర్శిస్తున్నారు. జీఎస్ రాజు రోడ్డు పాత పోలీస్ స్టేషన్ సమీపంలోని మలుపులో కొంతమంది వ్యాపారులు రోడ్డును ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేయడంతో అక్కడ ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ముఖ్యంగా బస్సులు ప్రభాస్ కళాశాల వైపు తిరిగే మలుపులో ఈ దుకాణాలు ఉండటంతో సమస్య తీవ్రంగా ఉంటోందని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు...

ప్రతి రోజూ వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగించే జీఎస్ రాజు రోడ్డులో శిథిలమైన వాహనాలను నిలపడంతో తీవ్రంగా ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. దీన్ని అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంతో గత కొన్ని సంవత్సరాలుగా ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుపై ఆక్రమణలను తొలగించి, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతు వాహనాలను తొలగించాలి



జీఎస్ రాజు రోడ్డులో నెలల తరబడి పాత వాహనాలు రోడ్డుపైనే ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటివలన రాత్రుళ్లు వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెట్టి శిథిలమైన వాహనాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– కొమరబత్తిన తిరుపతయ్య, స్థానికుడు

ఆపరేషన్ కగార్‌ను ఉపసంహరించుకోవాలి

- ఈ నెల 13న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు
- రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అటవీ సంపదను బడా కార్పొరేట్లకు కట్టబెట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిందని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. కగార్ పేరుతో ఆదివాసీలపై ప్రత్యక్ష సైనిక యుద్ధం చేస్తూ అడవుల్ని నెత్తుటి క్షేత్రంగా మార్చివేసిందన్నారు. ఈ మారణకాండకు మరోపేరే కగార్ అపరేషన్ అని తాము భావిస్తున్నామన్నారు. ఆపరేషన్ కగార్‌ను ఉపసంహరించుకోవాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు, వామపక్ష రాజకీయ పార్టీలతో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆదివాసీలపై సాగిస్తున్న హత్యాకాండను ఆపాలని సమావేశం డిమాండ్‌చేసింది. ఆపరేషన్ కగార్‌ను ఉపసంహరించుకోవాలని సమావేశం తీర్మానించింది. కగార్ ఆపరేషన్‌కు వ్యతిరేకంగా ఈనెల 13న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై అనాగరిక వేట సాగిస్తోందన్నారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో అమాయక ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్యలు చేస్తోందన్నారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం గతంలో ఆమోదించిన అనేక చట్టాలు, ఉత్తర్వులు, శాసనాలు, చట్ట సవరణలను క్రమంగా కేంద్రం నీరు గారుస్తోందన్నారు. ఆదివాసీల మనుగడకూ, జీవనోపాధికీ గతంలో తెచ్చిన చట్టబద్ధ సౌకర్యాలన్నింటినీ పునరుద్ధరించాలని సమావేశం డిమాండ్‌చేసింది. 'ఆపరేషన్ కగార్ ' కు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ సహకరించొద్దని రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించింది. సమావేశంలో సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధులు పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, సీపీఐ(ఎం.ఎల్)లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరనాథ్, ఓపీడీఆర్ నాయకులు సి.భాస్కరరావు, ఎంసీపీఐ(యూ) నాయకులు ఖాదర్ బాషా, మరీదు ప్రసాద్, హనుమంతరావు, విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు కె.పోలారి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సరస్వతీ కటాక్షం లభించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి చిన్నారికీ సరస్వతీ కటాక్షం లభించాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.వసంతకుమార్ అన్నారు. స్థానిక భానూనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో వసంత పంచమి పురస్కరించుకుని సోమవారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన చిన్నారులకు పలక, బలపాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. తమ వంతు బాధ్యతగా చిన్నారులకు పలక, బలపాలు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి గుర్రం ఏడుకొండలు, స్పందన సేవాసమితి అధ్యక్షుడు ఇ.కృష్ణమూర్తి, కె.హేమంతరావు, అంగన్‌వాడీ టీచర్ తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ టు గెదర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో...

హెల్పింగ్ టు గెదర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన సోమవారం వసంత పంచమి పురస్కరించుకుని భానూనగర్, దుర్గాపురం తదితర ప్రాంతాలలో చిన్నారులకు పలకలు, బలపాలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ డెప్యూటీ గవర్నర్ ఇ.కృష్ణమూర్తి, జి.ఏడుకొండలు, క్లబ్ అధ్యక్షురాలు కోరంగి నాగమల్లీశ్వరి, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే షఫీవుల్లా, కె.హేమంతరావు, వాకర్స్ క్లబ్ అదనపు కోశాధికారి వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు పలక బలపాలు అందిస్తున్న బ్రహ్మదేశం వసంతకుమార్

విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలు పెంచుకుని వ్యాపార వేత్తలుగా ఎదగాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యాన ఫ్రూట్ ప్రాసెస్డ్ ప్రొడక్ట్స్ తయారీలో శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ కార్యక్రమాన్ని వృక్షశాస్త్ర విభాగాధిపతి జి.స్వప్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు ఫ్రూట్ ప్రాసెస్డ్ ప్రొడక్ట్స్ తయారీలో అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. నాణ్యతా ప్రమాణాలతో పోషక విలువలు నష్టపోకుండా ఫ్రూట్ ప్రాసెస్డ్ ప్రొడక్ట్స్ తయారీ చేసేందుకుగానూ తాము ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో వివిధ ఉత్పత్తులను తయారు చేయటం వల్ల దీర్ఘకాలం పాటు నిల్వ చేయవచ్చని తెలిపారు. విద్యార్థులకు వివిధ రకాల పండ్లను ఉపయోగించి స్క్వాష్, జ్యూస్, కెచప్, జెల్లీ, మిక్స్‌డ్ ఫ్రూట్ జామ్ వంటి పలు రకాల ఉత్పత్తులను వాటిలోని పోషకాలకు హాని కలగకుండా ఎక్కువ కాలం నిల్వ ఉండేలా తయారు చేయటం నేర్పించారు. కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి జి.స్వప్న మాట్లాడుతూ తాము పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ పేపర్‌లో భాగంగా ఫుడ్ ప్రాసెస్డ్ ప్రొడక్ట్స్ తయారీలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ఉత్పత్తులను కళాశాల సిబ్బంది పరీక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వి.నాగపద్మావతి, తహసీన్, షేక్ బీబీ, బీఎస్సీ, బోటనీ, బయోకెమిస్ట్రీ, కెమిస్ట్రీ హార్టికల్చర్ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ తేజస్విని

కుష్టు, క్షయ వ్యాధులను ఆరంభ దశలోనే గుర్తించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): కుష్టు, క్షయ వ్యాధులను ఆరంభ దశలోనే గుర్తించి చికిత్స అందించటం ద్వారా అంగవైకల్యం, ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ, క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆధ్వర్యంలో సోమవారం అజిత్‌సింగ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లా ఆశా నోడల్ అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా ద్వారా వచ్చే అతి సాధారణ వ్యాధి అన్నారు. చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, స్పర్శ కోల్పోవటం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎండీటీ చికిత్స ద్వారా కుష్టువ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని అన్నారు. ఆరంభ దశలోనే వ్యాధిని గుర్తించటం ద్వారా అంగవైకల్యం బారిన పడకుండా నివారించవచ్చని అన్నారు. నిగూఢంగా దాగి ఉన్న కుష్టు కేసులను గుర్తించేందుకు గతనెల 20వ తేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే, వ్యాధి నిర్ధారణ కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం ఎల్‌సీడీసీ కార్యక్రమం, స్పర్శ అవగాహన కార్యక్రమాల ద్వారా నిర్వహించే లెప్రసీ, టి.బి వ్యాధి లక్షణాలు, నివారణ, చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డి.పి.హెచ్.ఎన్.ఓ లిడియా, డి.సి.ఎం హరీష్, కిల్కారీ ప్రతినిధి రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ జూపూడి ఉషారాణి

సమర్థంగా కేసులు ఛేదించిన క్రైం పోలీసులకు రివార్డులు



క్రైం పోలీసులకు రివార్డులు అందజేసిన సీపీ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: అనతికాలంలోనే కేసులను సమర్థంగా ఛేదించిన 10 మంది క్రైం పోలీసులను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు అభినందించి వారికి రివార్డులు అందజేశారు. పలు కేసుల్లో నేరస్తులను అరెస్ట్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్ఐలు బి.వి.స్వామి, సి.హెచ్.సత్యనారాయణ, ఎస్.కృష్ణమూర్తి, హెడ్ కానిస్టేబుళ్లు ఎం.ప్రకాష్‌రావు, జె.నాగరాజు, వి.రవికుమార్, కానిస్టేబుళ్లు జి.సురేష్, వి.వి.రమణ, షేక్ షబ్బీర్, జి.శిరీషకు నగదు రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో క్రైం డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు, సీఐ ఎం.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదిశంకరుల తపశ్శక్తి సమాజానికి శ్రీరామరక్ష

సామవేదం షణ్ముఖ శర్మ

విజయవాడ కల్చరల్: ఆదిశంకరుల తపశ్శక్తి సమాజానికి శ్రీరామరక్ష అని సామవేదం షణ్ముఖ శర్మ సూచించారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75 వర్ధంతి సందర్భంగా దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలో సోమవారం శంకర విజయం అంశంగా ఆయన ప్రసంగించారు. ఆదిశంకరులు వేదంలో చెప్పిన కర్మలను పాటించాలని సత్ గురువుల సేవలో తరించాలన్నారు. జ్ఞాన మార్గాన్ని బోధించేవాడు గురువని, అంధకారంలో ఉన్న వారికి వెలుగును ప్రసాదించేవాడు గురువని వివరించారు. సద్గురువులు లభించడం పూర్వజన్మ సుకృతం వల్లనే సాధ్యమవుతుందన్నారు. భగవాన్ వ్యాస మహర్షి బ్రహ్మ సూత్రాలను రచించారని, వాటిని ఆదిశంకరులు సూత్రీకరించినట్లు తెలిపారు. శంకరాచార్యులు సాక్షాత్తూ పరమశివుని అవతారమన్నారు. ఒకప్పుడు భారతదేశంలో సైద్ధాంతిక గందరగోళం ఉండేదని, ఎవరికి తోచిన విధంగా వారు భాష్యం చెప్పేవారని, దేశం అల్లకల్లోలంగా ఉండేదని, అటువంటి పరిస్థితుల్లో ఆదిశంకరులు అవతరించినట్లు తెలిపారు. తొలుత భారతీ తీర్థ మహాస్వామికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శిష్యా హనుమత్ ప్రసాద్, జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి, దుర్గామల్లేశ్వర స్వామి విశ్రాంత కార్యనిర్వహణ అధికారి కేఎస్ రామారావు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్ పాల్గొన్నారు.



భారతీ తీర్థ మహాస్వామి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

రేపు సిద్ధార్థలో కెమ్‌క్వెస్ట్–2025

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రసాయన శాస్త్రం చదువుతున్న విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి కెమ్‌క్వెస్ట్–2025 పేరుతో ఈ నెల 5వ తేదీ బుధవారం సిద్ధార్థ ఆడిటోరియంలో వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఆవరణలో కెమ్‌క్వెస్ట్–2025కి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. రమేష్ మాట్లాడుతూ స్టూడెంట్ అసోసియేషన్ ఆఫ్ కెమికల్ సైన్స్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కెమిస్ట్రీ బెయిన్ బూస్టర్, కెమికల్ ఎక్స్‌ప్రెషన్స్, పోస్టర్ ప్రజంటేషన్, ది రోల్ ఆఫ్ కెమిస్ట్రీ ఇన్ మోడరన్ సైన్స్ అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కెమిస్ట్రీ విభాగాధిపతి పీటీఎస్ఆర్‌కే ప్రసాదరావుతో పాటుగా అధ్యాపకులు పాల్గొన్నారు.

సోనూసూద్ ఫౌండేషన్‌కు చిన్నారుల సాయం

లబ్బీపేట(విజయవాడ తూర్పు): సోనూసూద్ ఫౌండేషన్‌కు నగరానికి చెందిన ఇద్దరు చిన్నారులు కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న నగదును అందజేశారు. విజయవాడ పర్యటనకు వచ్చిన ఆయనను నోవాటెల్ హోటల్‌లో దుద్దేల వరుణ్ గౌతమ్, దుద్దేల పుష్కళ్ కలిసి ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు గురించి తెలుసుకొని దాచుకున్న మొత్తాన్ని అందచేశారు. ఈ సందర్భంగా చిన్నారులిద్దరినీ సోనూసూద్ ప్రత్యేకంగా అభినందించారు.



నేడు తిరుచ్చి ఉత్సవం

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో వేంచేసివున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాఘ మాసం రథసప్తమి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఉదయం 6.30 గంటలకు జరిగే కార్యక్రమంలో కల్యాణమండపంలో స్వామి వారి ఊరేగింపు జరుగుతుందని భక్తులు స్వయంగా పాల్గొని స్వామి వారికి హారతి సేవను అర్పించవచ్చునని తెలిపారు.

ఉగాది పురస్కారాలను పునఃప్రారంభించాలి

విజయవాడ కల్చరల్: ఉగాది, కళారత్న పురస్కారాలను కూటమి ప్రభుత్వం పునః ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ చిల్లర భవానీ దేవి కోరారు. సంఘం ప్రతినిధులు సోమవారం స్థానిక సంగీత కళాశాల కార్యాలయంలో భాషా సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకుడు పెంచలయ్యను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఏటా ఉగాది, కళారత్న పురస్కారాలను ప్రదానం చేసిందని, ఈ ఏడాది అదేవిధంగా పురస్కారాలను ప్రదానం చేయాలని కోరారు.

శారదా కళాశాలలో వసంత పంచమి ప్రత్యేక పూజలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ బీఆర్టీఎస్ రోడ్డులో గల శారదా జూనియర్ కళాశాలలో శ్రీ పంచమిని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళాశాల ఆవరణలోని సరస్వతీ దేవి విగ్రహాన్ని అలంకరించి పూజలు చేశారు. వేద పండితులతో విద్యార్థులకు దీవెనలు అందించారు. పుస్తకాలు, కలాలు అమ్మవారి ముందు ఉంచి పూజలు చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.వరప్రసాద్, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వర శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కారు ఢీకొని స్టాఫ్‌నర్స్ ఇన్‌చార్జికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీ కొట్టడంతో స్టాఫ్‌నర్స్ ఇన్‌చార్జి గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పులూరుకు చెందిన చోడవరపు సోనీ (37) విజయవాడ సిటీ న్యూరో సెంటర్ హాస్పిటల్‌లో స్టాఫ్ నర్స్ ఇన్చార్జిగా పనిచేస్తున్నారు. ఆమె భర్త మోజెస్ కోఆపరేటివ్ సొసైటీలో పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం సోనీ విధులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరారు. గుణదల విద్యుత్ సౌధ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. తలకు బలమైన గాయం తగలటంతో గాయపడిన సోనీని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. హాస్పిటల్ నుంచి వచ్చిన సమాచారం మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి కళాశాలలో ఈగల్ టీమ్ బృందాలు

ఈగల్ వింగ్ ఐజీ రవికృష్ణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రతి కళాశాలలో ఈగల్ టీమ్ బృందాలను ఏర్పాటు చేస్తామని ఈగల్ వింగ్ ఐజీ (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్) రవికృష్ణ చెప్పారు. విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలలో డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు ముఖ్యఅతిథిగా హాజరైన ఈ సదస్సులో రవికృష్ణ మాట్లాడుతూ ఎన్డీపీఎస్ యాక్ట్ కేసుల్లో ఇరుక్కుంటే 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. రెండు ఎన్డీపీఎస్ కేసుల్లో నిందితులుగా ఉంటే ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కేసు తీవ్రత ఆధారంగా మరణశిక్ష విధించే అవకాశం కూడా ఉందన్నారు. విద్యార్థులే ఈగల్ అంబాసిడర్లుగా ఉండాలని వివరించారు. గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిస్తే 1972 నంబర్‌కి కాల్ చేయాలని చెప్పారు. విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లి విలువైన భవిష్యత్‌ను కోల్పోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఈగల్ ఎస్పీ కె.నగేష్ బాబు, సెంట్రల్ ఏసీపీ దామోదర్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, ప్రిన్సిపాల్ ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయవాడ సెంట్రల్ :
90102 01611
Office mail : sakshiads@gmail.com